క్లుప్తంగా

జాతీయ రహదారి విస్తరించాలని వినతి



అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: జాతీయ రహదారి ఎన్‌హెచ్ –63 రాష్ట్రంలోని నిజామాబాద్ నుంచి ధర్మపురి, జగ్దల్‌పూర్ వరకు చేపడుతున్న రహదారిని విస్తరించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సోమవారం నేషనల్ హైవే రీజనల్ అధికారి పి.శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఇటీవల నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కూడా నాలుగు లైన్ల రహదారి విస్తరించాలని కేంద్ర మంత్రి నితీశ్ గట్కరి వినతిపత్రం ఇచ్చారని, ఎంపీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి



సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇబ్రహీంపట్నం: పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్ల సర్వే వెంటనే పూర్తిచేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సోమవారం పరిశీలించారు. ఇబ్రహీంపట్నంలో ఎక్కువగా దరఖాస్తు రావడంతో సర్వే ఆలస్యమవుతోందని, దీంతో నలుగురు పంచాయతీ కార్యదర్శులతో సర్వే చేపడుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలో 7,941 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 71 శాతం సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, రాకేశ్, రాణి, ప్రసాద్ పాల్గొన్నారు.


కేసుల విచారణ త్వరగా పూర్తి చేయాలి



ఫైల్స్ పరిశీలిస్తున్న డీఎస్పీ రాములు

కోరుట్ల: కోరుట్ల సర్కిల్ పరిధిలోని కేసుల విచారణ త్వరగా పూర్తి చేయాలని మెట్‌పల్లి డీఎస్పీ రాములు అన్నారు. కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ రాములు సోమవారం సందర్శించారు. ఠాణాలోని ఫైల్స్‌ను డీఎస్పీ పరిశీలించారు. సర్కిల్ పరిదిలోని ఠాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడాలని సీఐ సురేశ్ బాబుకు సూచించారు. సర్కిల్ ఆఫీస్ నిర్వహణ బాగుందని సీఐని అభినందించారు. కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అక్రమ వ్యాపారస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. 100 డయల్‌కు వెంటనే స్పందించాలని పేర్కొన్నారు. డిసెంబర్ 31, నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అపశ్రుతులు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ సురేశ్ బాబు, ఎస్సైలు శ్రీకాంత్, రాంచంద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

కోరుట్ల: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో డిసెంబర్ 24 నుంచి 26 వరకు జరిగిన 9 వ జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో పట్టణానికి చెందిన కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఆయిల్ పాం సాగుకు రాయితీ

ఇబ్రహీంపట్నం: ఆయిల్‌పాం పంట సాగుకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అనేక రాయితీలు ఇస్తుందని ఏవో రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయిల్‌పాం ఒక్క మొక్కకు రూ. 193 కాగా, రైతులకు సబ్సిడీతో మొక్కకు రూ. 20 కే ఇస్తున్నామని తెలిపారు. ఆయిల్‌పాం సాగుచేసే రైతులకు నాలుగేళ్ల వరకు తోట నిర్వహణకు ఖర్చు, ఇతర ఖర్చులు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఆయిల్‌పాం సాగు చేయాలనుకునే రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

లింకు రోడ్డు పూర్తయ్యేదెప్పుడో?

- ఆరేళ్లుగా అనుమతులివ్వని అటవీ శాఖ
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- రోడ్డు పూర్తి చేయాలని గ్రామస్తుల విజ్ఞప్తి



కొజన్‌కొత్తూర్ - వేములకుర్తి లింకు రోడ్డు



శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ఇబ్రహీంపట్నం: మండలంలోని లింకురోడ్డు పనులు ఆరేళ్లయినా పూర్తికాకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని కొజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తి వెళ్లే లింకు రోడ్డు పనులు మధ్యలో అడవి ఉండడంతో అటవీశాఖ అధికారులు అనుమతిలేదని పనులను నిలిపివేశారు. కొజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తి లింక్ రోడ్డును బీటీ రోడ్డుగా చేసేందుకు డీఎంఎఫ్‌టీ నిదులు రూ.2.20 కోట్లు మంజూరు చేసింది. పనులను చేపట్టేందుకు అధికారులు టెండర్లు పిలిచారు.

పనులు దక్కించుకున్న సాయిరాం కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకోగా, సెప్టెంబర్ 4 2018న అప్పటి కోరుట్ల ఎమ్మెల్యే పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించగా కొజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తికి 2.1 కిలో మీటర్ల వరకు బీటీ రోడ్డు వేయగా, అటవీ ప్రాంతంలో ఉన్న 1.7 కిలోమీటర్లలో అటవీశాఖ అధికారులు అనుమతి లేదని పనులను నిలిపివేశారు.

కాంట్రాక్టర్ కేసు

కల్వర్టుల నిర్మాణం కోసం కాంట్రాక్టర్ పైప్‌లు వేసేందుకు తవ్వగా అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేసి రూ.51 వేల జరిమానా విధించారు. దీంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులు నిలిపివేశారు. కొన్నేళ్ల నుంచి కొజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తి లింకు రోడ్డు ఉండగా ఈ రోడ్డుపై పునరావాస గ్రామాల కింద వచ్చిన మెటల్ రోడ్డును నిర్మించారు. అప్పుడు అభ్యంతరం తెలపని అటవీశాఖ అధికారులు బీటీ రోడ్డు పనులు చేపట్టగానే అనుమతి లేదని ఆపివేయడంతో రైతులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ లింకు రోడ్డు పూర్తయితే వేములకుర్తి, బర్దిపూర్, మూలరాంపూర్ గ్రామాల రైతులు మండల కేంద్రానికి రావడానికి దూరభారం తగ్గుతుంది.

రోడ్డంతా గుంతలమయం

ఆరేళ్లుగా అటవీ శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో రోడ్డు మధ్యలోనే ఆగిపోయి గుంతలు, గుంతలుగా ఏర్పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.అటవీ అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, జాయింట్ సర్వే చేసి అధికారులకు నివేదిక పంపినప్పటికీ ఇప్పటి వరకు అనుమతులు రాలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని మండల ప్రజలు, రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

సర్వే పూర్తయింది

ఆగిపోయిన లింక్ రోడ్డు పనులను చేపట్టేందుకు అటవీశాఖ అనుమతుల కోసం అటవీశాఖ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎప్పుడో సర్వే చేసి అనుమతు కోసం పంపాం. ఇప్పటి వరకు అనుమతి రాలేదు. అనుమతి రాగానే బీటీ రోడ్డు పనులను పూర్తి చేస్తాం.

– రమణారెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ డీఈ, మెట్‌పల్లి

నాయకులు చొరవ చూపాలి



లింకు రోడ్డు పూర్తి కాకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అటవీశాఖ అధికారులు రోడ్డు కోసం సహకరించాలి. కొజన్‌కోత్తూర్, వేములకుర్తి లింకు రోడ్డు పనులు చేపట్టేందుకు అటవీశాఖ అధికారుల అనుమతి వచ్చేలా స్థానిక ప్రజాప్రతినిధులు, ఈ ప్రభుత్వంలోని నాయకులపై ఒత్తిడి తెచ్చి అనుమతి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– రాదారపు దేవదాస్, వేములకుర్తి

దూరభారం తగ్గుతుంది



కొజన్‌కొత్తూర్, వేములకుర్తి లింకురోడ్డు పూర్తయితే మండల కేంద్రానికి రావడానికి దూరభారం తగ్గుతుంది. నిత్యం మండల కేంద్రానికి రావడానికి పలు గ్రామాల ప్రజలు 16 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తోందని, ఈ లింక్ రోడ్డు పూర్తి అయితే మండల కేంద్రానికి రావడానికి 6 కిలోమీటర్లే దూరం అవుతుంది. వెంటనే లింక్ రోడ్డు పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– అశోక్, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్, వేములకుర్తి



కోరుట్ల: పట్టణంలోని కల్లూర్ రోడ్‌లో తక్కువ వెలుతురు లైట్లు అమర్చటంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడూ రద్దీతో ఉండే రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్తంభాలకు బల్బులు పెట్టినప్పటికీ డబుల్ రోడ్డు కావటంతో వెలుతురు సరిపోక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి హైఓల్టేజీ లైట్లు, అవసరం ఉన్న చోట హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
బట్టు తిరుపతి, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల, సెల్ నంబర్: 9849905880

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

జగిత్యాలటౌన్: అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే తన మంత్రి పదవికి, లోకసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ రావు డిమాండ్ చేశారు. కొత్తబస్టాండ్ చౌరస్తాలోని పటేల్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీఎస్ రావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో దళిత హెడ్మాస్టర్‌ను అవమానపరిచిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన నాయకులు కోమటి చంద్రశేఖర్, తిరుపతి నాయక్, ఎంఏ చౌదరి, వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన ఉంటే రౌడీషీట్ తొలగిస్తాం



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న సీఐ

మెట్‌పల్లి: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలిగితే ఉన్నతాధికారులతో మాట్లాడి రౌడీషీట్లను తొలగిస్తామని సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఎలాంటి అసాంఘీక చర్యలకు పాల్పడినా పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామన్నారు. రౌడీషీట్లు తెరిస్తే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని, వీటిని దృష్టిలో పెట్టుకుని నడవడికను మార్చుకోవాలన్నారు. ప్రతి రౌడీ షీటర్‌పై నిరంతరం నిఘా పెడుతామని, తమ పరిశీలనలో సత్ప్రవర్తనతో మెలుగుతున్నారని తేలితే రౌడీషీట్లు ఎత్తివేయాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్ ఉన్నారు.

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మెట్‌పల్లి: న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ రాములు సూచించారు. పట్టణంలోని పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. వేడుకల సందర్భంగా డీజే లను వినియోగించవద్దన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై కేక్‌లు కట్ చేయడం, బహిరంగంగా మద్యం సేవిస్తే, మైనర్లు వాహనాలు నడిపిస్తే కేసులు పెడుతామన్నారు.

పెగడపల్లి: నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై రవికిరణ్ మండల ప్రజలను కోరారు. గ్రామాల్లో పోలీస్ పెట్రోలింగ్ ఉంటుందన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

రాయికల్: చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుధీర్‌రావు అన్నారు.నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే వారు రోడ్లపై కేకులు కట్ చేయడం, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

చెన్నకేశవ ఆలయాన్ని సందర్శించిన విద్యార్థులు



రాయికల్: పట్టణంలోని ప్రాచీన దేవాలయం చెన్నకేశవనాథ ఆలయాన్ని సోమవారం జగిత్యాలకు చెందిన శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఆలయ ప్రాధాన్యత, పంచముఖ లింగం గురించి విద్యార్థులకు ప్రిన్సిపల్ జ్యోతి రవీందర్ వివరించారు.

మహిళలు ఫిర్యాదు పెట్టెను సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్: మహిళలు వేధింపులకు గురైతే తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఖయ్యూం కోరారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు లైంగిక వేదింపులకు గురైతే వెంటనే ఫిర్యాదు చేస్తే గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై స్వప్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతితోనే ఇసుక రవాణా చేయాలి

రాయికల్: మండలంలో ట్రాక్టర్ యజమానులు ప్రభుత్వ అనుమతితోనే ఇసుక రవాణా చేయాలని తహసీల్దార్ ఖయ్యూం సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని సూచించారు. ట్రాక్టర్ యజమానులు గమనించి సహకరించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

రాయికల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తోందని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. సోమవారం పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగరాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాజంగి రాజేశం, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

పెగడపల్లి: పాఠశాల నుంచి విద్యార్థులు ఇళ్లకు వచ్చిన తరువాత తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్‌ఎం శాంతమ్మ అన్నారు. మండలంలోని సుద్దపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదివి మంచి జీపీఏ సాధించాలన్నారు. విద్యార్థులకు అల్పాహారం కోసం తల్లిదండ్రులు రూ. 5 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ భూమేశ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కృష్ణవేణిలో రెడ్ కలర్ డే

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సోమవారం చిన్నారులకు రెడ్‌కలర్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, ఉపాధ్యాయులు రెడ్‌కలర్ దుస్తులు ధరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రావు రెడ్ కలర్ ప్రాధాన్యత గురించి వివరించారు.

వ్యవసాయ మోటారు చోరీ

మల్యాల: మండల కేంద్రానికి చెందిన రైతు రాజిరెడ్డి తన వ్యవసాయ బావి వద్ద అమర్చిన మోటారును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్థానిక రాయంచ చెరువు సమీపంలోని తన వ్యవసాయ బావి వద్ద ఉన్న 3హెచ్‌పీ మోటారు పెట్టేందుకు సోమవారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా మోటారు లేకపోవడం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూర్, మాదాపూర్,సర్పరాజ్‌పూర్, ఐలాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో ఓదెల రామకృష్ణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మొబైల్ సర్వేలో సరైన డేటాను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు పాల్గొన్నారు.

● ఆఫ్‌లైన్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కథలాపూర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదుకు ఇంటర్‌నెట్ సమస్యలు రావడంతో ఆఫ్‌లైన్ సర్వేకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మండలంలోని తుర్తి గ్రామంలో ఇంటర్‌నెట్ సౌకర్యం సరిగా లేకపోవడంతో సోమవారం ఆఫ్‌లైన్‌లో ఇళ్ల సర్వేను ప్రారంభించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు 230 మంది దరఖాస్తు చేసుకోవడంతో అధికారులు దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్వేను చేపట్టారు.

● బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన అన్నపు వెంకటేష్ క్యాన్సర్ బారిన పడి మృతి చెందగా, బాధిత కుటుంబానికి సోమవారం గ్రామస్తులు రూ.26,616 ఆర్థికసాయం, 25 కేజీల బియ్యాన్ని అందించారు. బాధిత కుటుంబానికి దాతలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బైన ప్రశాంత్, బోగే శ్రీనివాస్, బియ్యపు సురేష్, తోట శ్రీనివాస్, నరేశ్, తిరుపతి పాల్గొన్నారు.

● క్యాలెండర్ ఆవిష్కరణ

మల్యాల: మండలంలోని లంబాడిపలిలో మిల్కూరి మల్లారెడ్డి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను యూట్యూబ్ ఫేమ్స్ అంజి, చందు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు మిత్ర సంఘం అధ్యక్షుడు మరాటి శ్రీనివాస్, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఎడిపెల్లి శ్రీనివాస్, ఆర్‌ఎంపీ గోపాలకృష్ణ, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు మామిడి మల్లయ్య, గంగాచారి, మహేశ్, అజయ్ పాల్గొన్నారు.

● దుబ్బరాజన్న ఆలయంలో వేలం పాట

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలతో పాటు, ఏడాది పాటు వివిధ పూజా సామగ్రి, ప్రసాదాలు, ఇతర వస్తువుల అమ్మకాల కోసం సోమవారం నిర్వహించిన బహిరంగ వేలంలో రెండింటికి మాత్రమే వేలం పాటలు జరిగారు. కొబ్బరి ముక్కల సేకరణకు రూ. 2.02 లక్షలు, తలనీలాల పోగుచేసుకునేందుకు రూ.3.75 లక్షలు వేలం దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అనూష, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యుడు పొరండ్ల శంకరయ్య, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

● శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

మల్లాపూర్: శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ఎస్సై రాజు అన్నారు. ఎస్సై కొనస రాజును సోమవారం సిరిపూర్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సర వేడుకలను చట్టానికి లోబడి జరుపుకోవాలన్నారు.

● బలహీన వర్గాల సంఘం అధ్యక్షుడిగా గంగయ్య

జగిత్యాలజోన్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ ఆదర్శ బలహీన వర్గాల సంఘం అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ గర్వందుల చిన్న గంగయ్య సోమవారం ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీ పడగా, గర్వందుల చిన్న గంగయ్య గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా ఆకుల గంగాధర్, ఉపాధ్యక్షుడిగా గుండారపు రాజేశ్, కోశాధికారిగా బండారి స్వామి గెలుపొందారు.

● మోచీ సంఘం నూతన కార్యవర్గం

జగిత్యాలటౌన్: మోచీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు పట్టణంలోని మోచీ సంఘ భవనంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కొండ్లెపు ముత్యం, ఉపాధ్యక్షులుగా కావల్ల భిక్షపతి, ఒటారికారి రాంచంద్రం, ఒటారికారి భూమేశ్, ప్రధాన కార్యదర్శిగా కొండ్లెపు సుధాకర్, సహాయ కార్యదర్శిగా ఒటారికారి ప్రవీణ్, కోశాదికారిగా కొండ్లెపు సాయిలు ఎన్నికైనట్లు నిర్వాహకుడు పోలుకారి చిన్నరాజయ్య తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెగడపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బాల్య మిత్రులంతా వారి తీపి జ్ఞాపకాలు, మధురమైన సంఘటనలు, చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా, సంతోషంగా గడిపారు. తమకు చదువు నేర్పిన గురువులు నాగేశ్వర్‌రావు, కిషన్‌రావు, రామ్‌రెడ్డిలను శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జగిత్యాల: పట్టణంలోని చైతన్య పబ్లిక్ స్కూల్‌కు చెందిన 1996-97 పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరి యోగక్షేమాలు తెలుసుకుని కబుర్లు చెప్పుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు.